# కథ

# నా మొగుడు నా సొంతం

-వాణిశ్రీ

**అజయ్ పెళ్లిచూపులకు బయల్దేరాడు. అతని అక్క రాజ్యలక్ష్మి, బావ వెంకటరామారావు తోడుగా వెళ్తుంటే సీతారామయ్య కూతురితో చెప్పాడు.**

**"పెళ్లికూతురితో ఏం మాట్లాడాలో వాడికి చెప్పు. లేకపోతే వాడేదో పిచ్చివాగుడు వాగుతాడు. ఈ సంబంధం కూడా కుదరదు."**

**రాజ్యలక్ష్మి తల ఊపింది.**

**"ఏమిటి నాన్న చెప్తున్నాడు?" కారులో కూర్చున్నాక అడిగాడు అజయ్.**

''పెళ్లికూతురితో ఏం మాట్లాడాలో ట్రైనింగ్ ఇవ్వమంటున్నాడు'' అని నవ్వింది రాజ్యలక్ష్మి.

''సరే చెప్పు!''

''ఈ సంబంధం నాన్నకి బాగా నచ్చింది. పిల్ల చాలా అందంగా ఉంది.''

''నాన్నకి వాళ్లు ఆఫర్ చేసిన కట్నం బాగా నచ్చి ఉంటుంది'' అన్నాడు అజయ్.

''ఆ సంగతి ఎందుకు? ఇప్పుడు విషయమేమిటంటే ఆ పిల్లకి నువ్వు నచ్చాలి.''

''ఓహో..''

''అవునోయ్! ఈమధ్య వాళ్ల పనికిరాని భూములు బంగారమైనాయంట. బ్లాక్‌మనీ మూలుగుతుందట. అదీగాక ఆ పిల్ల తండ్రి మీ నాన్నకి బీరకాయపీచు సంబంధంలో బామ్మర్ది అవుతాడట. అప్పుడే బామ్మర్ది గారూ అంటూ జోకులేస్తున్నాడు. ఎట్లాగైనా ఆ అమ్మాయిని ఇంప్రెస్ చేసుకో'' అని వెంకటరామారావు బామ్మర్దితో మేళమాడాడు.

''ఇప్పుడర్థమైందిలే.. ఆవిడగారు ఎమ్మె చదివిందిగా! స్త్రీవాద సాహిత్యం బాగా వంట పట్టించుకుని ఉంటుంది. ఆకాశంలో సగం మేము అంటుంది. పెళ్లయ్యాక నీ డామినేషన్ కుదరదు. అన్నింట్లో సమాన భాగస్వామ్యం ఉండాలి అని వాదిస్తుంది. నాకు సమాన గౌరవం ఇవ్వాలంటుంది. నా విషయాలలో జోక్యం చేసుకోకూడదు. ఒకవేళ నేను జాబ్ చేస్తే నువ్వు జీతం అడగకూడదు అంటుంది. అంతేగా! ఓ.కె.'' అన్నాడు అజయ్.

''అంతేలేరా! ముందు పెళ్లవనీ. ఆ తర్వాత ఏదీ తన ఇష్టప్రకారం జరగదని తెలుసుకుంటుంది'' అని నవ్వింది రాజ్యలక్ష్మి.

''నువ్వున్నావుగా అర్థమొగుడివి. పెళ్లాన్ని ఎట్లా రాచిరంపాన పెట్టాలో ట్రైనింగ్ ఇస్తావుగా'' అన్నాడు వెంకటరామారావు.

''నేను మీ కంటికి రాక్షసిలా కనిపిస్తున్నానా? మీ చెల్లెలి కన్నా నయమేగా!'' అన్నది రాజ్యలక్ష్మి మూతి వంకరగా తిప్పి.

''గుడ్డిలో మెల్ల నయంలే'' అన్నాడు రామారావు.

ఆ కారు ఆదినారాయణ ఇంటిముందు ఆగింది. ఆదినారాయణ వారిని ఆహ్వానించి ఇంట్లోకి తీసుకెళ్లాడు.

అమ్మాయి పేరు కోటేశ్వరి. అంతా ఈశ్వరి అని పిలుస్తున్నారు. కాఫీ ఫలహారాలు అయిన తర్వాత ఈశ్వరి తను అజయ్‌తో పర్సనల్‌గా మట్లాడాలన్నది. అజయ్ అందుకు సిద్ధంగానే ఉన్నాడు.

బాల్కనీలో కూర్చోబెట్టారు ఇద్దర్నీ.

''మీరు నెలకి ఎంత సంపాదిస్తున్నారు?'' అడిగింది ఈశ్వరి.

''ఇరవై వేలు'' చెప్పాడు అజయ్.

''పెళ్లయ్యాక జీతం ఏం చేస్తారు?''

''తెచ్చి నీకే ఇస్తాను.''

''నాకెందుకు ఇవ్వడం?''

''ఎందుకేంటి? సంసారం నడపాల్సింది నీవేగా? ఫస్ట్ వీక్‌లో ఎన్నో ఖర్చులుంటాయి. సూపర్ మార్కెట్‌కి వెళ్లి నెలకి కావల్సిన సరుకులు తెచ్చుకోవాలి. పాల బూత్‌లో డబ్బు కట్టాలి. రైతుబజార్‌కెళ్లి కూరగాయలు తెచ్చుకోవాలి. ఇక పండుగలు అవీ వస్తే షాపింగ్‌కి వెళ్లి చీరలు కొనుక్కోవాలి'' అన్నాడు అజయ్.

''రిలేటివ్స్, ఫ్రెండ్స్ ఇళ్లల్లో పెళ్లిళ్లు, ఫంక్షన్స్ జరుగుతుంటాయిగా! వెళ్లాలా వద్దా అనేది ఎలా డిసైడ్ చేస్తారు?''

''నాదేం లేదు. అంతా నీ ఇష్టమే. నువ్వు వెళ్దామంటే వెళ్దాం. లేదంటే లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే స్త్రీ స్వేచ్ఛగా ఉండడం నాకు ఇష్టం. మగవాడిపైన ఆధారపడే దౌర్భాగ్య పరిస్థితి నుంచి స్త్రీ బైటపడాలని నా ఉద్దేశ్యం'' అన్నాడు అజయ్.

ఈశ్వరి అతన్ని విచిత్రంగా చూసింది.

''నా ఫ్రెండ్స్ కొందరు భార్యలను తెగ ఏడిపించుకు తింటుంటారు. ఏదైనా ఫంక్షన్స్‌కి బయల్దేరినప్పుడు చక్కగా పట్టుచీర కట్టుకుని, నగలు పెట్టుకుందనుకోండి. ఏంటా అమ్మోరి వేషం? సింపుల్‌గా ఉండలేవూ అని కసురుకుంటారు. ఆ చీర కట్టుకో, ఈ చీర కట్టుకో, ఆ రంగు బాగా లేదు అని వంకలు పెడతారు. వాళ్లంతా శాడిస్ట్‌లని నా నమ్మకం'' అని కళ్లెగరేశాడు.

''ఐతే మీరిక సంసారంలో ఏమాత్రం జోక్యం చేసుకోరన్నమాట'' అన్నది ఈశ్వరి.

''నో.. నెవర్.''

''ఆఫీసు లేనప్పుడు ఖాళీ టైమ్‌లో ఏం చేస్తారు?''

''ఏవుంది? మా ఆఫీసు కాంప్లెక్స్‌లో క్లబ్ ఉంది. అక్కడ కాలక్షేపం చేస్తాను.''

''క్లబ్‌లో డ్రింక్ చేస్తారా? పేకాట ఆడతారా?''

''నో... నేను షటిల్ ఆడతాను.

దట్సాల్'' అన్నాడు అజయ్.

ఇంటర్వ్యూ ముగిసిందన్నట్లుగా లేచి నిలుచుంది ఈశ్వరి. అజయ్ కూడా లేచి బాల్కానీలో నుంచి వచ్చేశాడు.

ఆదినారాయణ కుటుంబానికి వెళ్లొస్తామనీ, రేపు ఫోన్ చేస్తామనీ బయల్దేరారు.

''ఏం మాట్లాడిందిరా ఆ పిల్ల?'' అడిగింది రాజ్యలక్ష్మి.

అజయ్ వివరంగా చెప్పాడు.

''బాగా చెప్పావురా! అమ్మాయి ఇంప్రెస్ అయి ఉంటుంది'' అని మురిసిపోయింది రాజ్యలక్ష్మి.

''మీ తమ్ముడు ఇంటర్వ్యూలో పాస్. మీ నాన్న జాక్‌పాట్ కొట్టినట్లే! ఆడబిడ్డ కట్నం ఎంతో ఇక నువ్వు తేల్చుకోవాలి'' అని ఆట పట్టించాడు వెంకటరామారావు.

''నాకెంత వస్తే మీకేంటి? అందులో పైసా కూడా మీకివ్వను.''

''పైసలెందుకోయ్ మనకి. చెక్కులు కావాలి గానీ'' అన్నాడు రామారావు.

అందరూ నవ్వుకున్నారు.

★ ★ ★


ఇంటికి వెళ్లిన తర్వాత తండ్రికి జరిగినదంతా పూసగుచ్చినట్లు చెప్పింది రాజ్యలక్ష్మి. సీతారామయ్య సంతోషించాడు. ఆదినారాయణ బామ్మర్ది వరసకావడం, అజయ్‌కి అమ్మాయి నచ్చడం అన్నీ బాగా కుదిరాయి అనుకున్నాడు. ఆదినారాయణ రియల్ బూమ్‌తో కోటీశ్వరుడిగా మారడంతో కట్నం ఇంత అని ఫిగర్ చెప్పకూడదని డిసైడ్ చేసుకున్నాడు. బ్లాక్‌మనీ అంతా ఏం చేసుకుంటాడు? కూతురికి ఇవ్వక చస్తాడా? అనుకున్నాడు.


మర్నాడు రాజ్యలక్ష్మి చొరవ తీసుకుని ఆదినారాయణ ఇంటికి ఫోన్ చేసింది. ఆయన భార్య కాల్ రిసీవ్ చేసుకుంది.


''నమస్తే ఆంటీ. మీకు గుడ్‌న్యూస్. మా అజయ్‌కి మీ ఈశ్వరి నచ్చిందట'' అన్నది రాజ్యలక్ష్మి.

''మీకు బ్యాడ్‌న్యూస్. మా ఈశ్వరికి మీ అజయ్ నచ్చలేదట'' అన్నది ఆదినారాయణ భార్య.

''అదేంటి ఆంటీ! మా తమ్ముడే హేండ్‌సమ్, ఫెయిర్'' అని రాజ్యలక్ష్మి చెప్తుండగానే ఆమె, ''ఏమోనమ్మా నువ్వోకసారి మా ఈశ్వరితో మాట్లాడు'' అన్నది.






''హలో ఈశ్వరీ...''

''హలో! రాజ్యలక్ష్మిగారా! గుడ్‌మా ణింగ్. మీ తమ్ముడు నాకు నచ్చలేదండీ'' అన్నది ఈశ్వరి.

''మావాడు అందంగా లేడా?''

''ఫిజికల్‌గా కాదండీ. చూడ్డానికి బాగానే ఉన్నారు. అది కాదు నాకు నచ్చనిది. రేపు పెళ్ల య్యాక ఆయన ఎలా బిహేవ్ చేస్తారు అనేద న్నమాట.''

''మీరిద్దరూ మాట్లాడుకున్నారుగా?''

''అవునండీ. ఆయన అంతా చెప్పారు. అటువంటి టైపువాళ్లు నాకు నచ్చరండీ.''

''అదేంటి? పెళ్లయ్యాక పెత్తనమంతా నీదేనని చెప్పాడంటగా! పైగా నెల నెలా జీతం కూడా తెచ్చి నీ దోసిట్లో పోస్తానన్నాడట. ఇంకేం కావాలి?'' అడిగింది రాజ్యలక్ష్మి.

''మీ తమ్ముడు లేజీ ఫెలోలా కనిపిస్తున్నా డండీ.''

''వాట్?''

''అవునండీ! బాధ్యత అంతా పెళ్లాం మీదకు నెట్టేసి తను దర్జాగా క్లబ్బులో టైంపాస్ చేస్తాడట.''

''నీకే మంచిదిగా! ఎందులోనూ జోక్యం చేసుకోడు. హాయిగా ఉంటుందిగా?''

''అదేం హాయి? నాకు అలా ఇష్టం లేదు. నా భర్త ట్వంటీ ఫోర్ అవర్స్ హజ్బెండ్ డ్యూటీలో ఉండాలి. నన్ను ప్రతిక్షణం గైడ్ చెయ్యాలి. ఇదిగో ఈ టీ పొడితో టీ బాగుంటుంది, ఈ పూట పెస రట్టు, ఉప్మా తిందాం అనాలి. మనం సూపర్ మార్కెట్‌కి వెళ్లి సరుకులు తెచ్చుకుందాం అని వెంట తీసుకెళ్లాలి. ఈ చీర నీకు చాలా బాగుంటుందోయ్, ఈ మేచింగ్ బ్లౌజ్ వేసుకో అని చెప్పాలి. నేను వంట చేస్తుంటే తను కూరగాయలు తరిగి కబుర్లు చెప్పాలి.''

''ఇంకా?''

''రోజూ నాకు ఐ లవ్ యూ ఈశ్వరీ అని వందసార్లు చెప్పాలి.''

''నీకు పళ్లు తోమాలి, నువ్వు స్నానం చేస్తుంటే వీపు రుద్దాలి. నువ్వు పడుకుంటే 'జో'కొట్టాలి'' వళ్లు మండిపోతోంది రాజ్యల క్ష్మికి.

విసురుగా రిసీవర్ పెట్టేసింది రాజ్యలక్ష్మి.

''ఏమంటున్నారమ్మా ఆదినారాయణ వాళ్లు?'' అడిగాడు సీతారామయ్య.

''ఆ పిల్లకు పిచ్చిలా ఉంది నాన్నా! దానికి కావల్సింది మొగుడు కాదు, వార్డెన్'' అన్నది కసిగా.

☆

## జెనీలియా డిమాండ్!

**జెనీలియాకి వరసగా రెండో సూపర్ హిట్ 'ఢీ' రూపంలో దొరికింది. అంతకు ముందు 'బొమ్మరిల్లు' సినిమా ఘన విజయం సాధించింది. ఇక ఆమె రాబోయే సినిమా 'మిస్టర్ మేధావి' గనక హిట్టయితే హేట్రిక్ సాధించినట్టవుతుంది. ఆ సినిమా తర్వాత జెనీలియా తన పారితోషికాన్ని 50 లక్షల వరకూ పెంచేసినా ఆశ్చర్యం లేదు అంటున్నారు సినీజనాలు. ప్రస్తుతం జెనీలియా సినిమాకి 35 లక్షల వరకూ తీసుకుంటు న్నట్టు టాలీవుడ్ వర్గాల కథనం.**

